క్లుప్తంగా

ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటుకు శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

శంకరపట్నం: కన్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి శుక్రవారం మానకొండూర్ ఎమ్మెల్యే రసమయిబాలకిషన్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి రవీందర్‌రెడ్డి, వైద్యాధికారి వేణుగోపాల్, సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, పాల్గొన్నారు.

అభ్యంతరాలను స్వీకరించాలి



మాట్లాడుతున్న జెడ్పీసీఈవో ప్రియాంక

మానకొండూర్‌రూరల్: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్లకు, అన్నిపార్టీల నాయకులకు ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీసీఈవో, ఎన్నికల అధికారి ప్రియాంక పాల్గొన్నారు. నాయకులు, అధికారుల అభ్యంతరాలకు, వాదనలకు సమాధానమిచ్చారు. బీఎల్‌వోలు అభ్యంతరాల స్వీకరణను, ఓటరు నమోదు ప్రక్రియను తప్పులు లేకుండా, త్వరగా పూర్తిచేయాలన్నారు.

ఆర్థికసాయం అందజేత



చెక్కు అందిస్తున్న సత్యం

రామడుగు: మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఎగుర్ల మల్లేశం విద్యుత్ షాక్‌తో మృతిచెందగా, శుక్రవారం కాంగ్రెస్ తరుపున అందిన ప్రమాదబీమా చెక్కును చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ డాక్టర్ మేడిపల్లి సత్యం కుటుంబ సభ్యులకు చెక్కును అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పులి అంజనేయులు గౌడ్, కోల రమేశ్, బొమ్మరవేని తిరుపతి, రాములుగౌడ్, శ్రీనివాస్, రాజేశ్, అంజయ్య, శంకర్, శేఖర్, కనకయ్య,మహేందర్ పాల్గొన్నారు.

డీపీవో విచారణ



ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న వీరబుచ్చయ్య

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో పలువురు 'ప్రజావాణి'లో సర్పంచ్ తమను ఇబ్బందులకు గురిచేస్తోందని ఫిర్యాదు చేశారు దీంతో శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య జీపీ కార్యాలయంలో ఫిర్యాదులపై విచారణ చేశారు. అనంతరం గ్రామంలోని పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. సర్పంచ్ సత్యప్రసన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆత్మకథ పుస్తకం బహూకరణ



జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామంలో 2వవార్డు కౌన్సిలర్ మారపల్లి బిక్షపతి ఇటీవల నూతన గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించగా శుక్రవారం తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ సతీమణి గెల్లుశ్వేత హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్వేతకు అంబేడ్కర్ ఆత్మకథ, సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర పుస్తకాలను అందించారు. అనంతరం బిక్షపతి దంపతులు శ్వేతకు పట్టువస్త్రాలను అందించి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్ల దోపిడీ అరికట్టాలి

హుజూరాబాద్: రైస్‌మిల్లర్లు ధాన్యానికి కోతపెడుతూ కళ్లముందే నిలువు దోపిడీ చేస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి శుక్రవారం కోరారు. జిల్లాలో పెద్ద ఎత్తున వరి, మొక్కజొన్న మామిడి, కూరగాయ పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందులుపడుతుంటే.. ఇదే అదునుగా కొందరు రైస్‌మిల్లర్లు తరుగుపేరుతో కోతలు విధిస్తున్నారన్నారు. అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మార్కెట్ పాలకవర్గం

నియామకం లేనట్టేనా!

- తొలిసారిగా దళిత మహిళకు రిజర్వేషన్ కేటాయింపు
- 8 నెలలుగా ఎదురు చూపులు
- రానున్న సార్వత్రిక ఎన్నికలే అడ్డంకిగా మారాయా!
- అసంతృప్తిలో పార్టీ శ్రేణులు



జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ అర్చీ



జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ ఉత్తర తెలంగాణలో అతిపెద్ద రెండో మార్కెట్‌గా పేరుగాంచింది. కాటన్‌లో వరంగల్ మార్కెట్‌కు పోటీపడుతు ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో ప్రత్యేకస్థానం సంపాదించుకుంది. పాలక వర్గం కాలం ముగిసి 8నెలలు గడుస్తోంది. రాష్ట్రప్రభుత్వం మార్కెట్ నియమకాలపై తొలిసారి దళిత మహిళలకు రిజర్వేషన్ కేటాయించడంతో ఇప్పటీ వరకు పాలకవర్గం ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, పార్టీ ముఖ్యనాయకులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రదక్షిణలు చేస్తున్నా నియామకంపై స్పందన లేకుండాపోయింది. దీంతో రానున్న సార్వత్రిక ఎన్నికలే అడ్డంకిగా మారాయని చర్చ జరుగుతోంది. హుజూరాబాద్ నియోజకవర్గంలో జమ్మికుంట మార్కెట్ ప్రధానం కావడంతో చైర్మన్ నియామకంపై జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, కమలాపూర్ మండలాల్లో రాజకీయ ప్రకంపనలు చోటుచేసుకునే అవకాశం ఉంది. సార్వత్రిక ఎన్నికలు జరిగే వరకు పాలక వర్గం నియామకం లేనట్టేనని.. సర్వత్రా చర్చనీయాంశం జరుగుతోంది.

ఆశావహుల వినతులు ..

దళిత మహిళకు తొలిసారి మార్కెట్ చైర్మన్ పదవి దక్కుతుండడంతో ఆశావహులు ప్రజాప్రతినిధు లు పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకుయత్నిస్తుండగా పట్టించుకోకపోవడంతో ఆసామజిక వర్గంలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. దీంతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే అవకాశాలు లేకపోలేదు. ఏదేమైనా నియామకం కత్తిమీద సాముల మారనుంది. కాలయాపన సాగుతుండడంపై చర్చనీయాంశమైంది.

ఈటల తనదైన శైలిలో నియామకాలు!

మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ నియోజకవర్గంలో పరిపాలన, రాజకీయంలో తనదైన శైలిలో ముద్ర వేసుకున్నారు. అప్పుడు మార్కెట్ చైర్మన్ నియామకంలో అన్నితానై పార్టీ నాయకులను ఒకేతాటిపై నడిపించారు. ఈటల సూచించిన వారికి పదవివరించింది. ఎలాంటి విబేధాలు లేకుండా పనులు ముందుకుసాగాయి. ప్రస్తుతం పరిస్థితులు మారడంతో ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నితానై బీఆర్‌ఎస్ పార్టీని నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం నియోజకవర్గంలోని మండలాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. గతంలో వర్గాలుగా ఉన్నవారిని సమన్వయంచేసి ఎవరికి చైర్మన్ పదవి కట్టబెడతారో వేచిచూడాల్సిందే.

సార్వత్రిక ఎన్నికలు అడ్డంకి!

బీఆర్‌ఎస్ ప్రభుత్వం మార్కెట్ చైర్మన్ పదవి కట్టబెట్టేందుకు రానున్న సార్వత్రిక ఎన్నికల వరకు వేచిచూసేధోరణి కనిపిస్తోంది. అప్పటివరకు నియామకం లేనట్టే కనబడుతోంది. ఒకవేళ నియామకం చేపడితే చైర్మన్ పదవి ఒక్కరికే దక్కే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆశావహులు ఎన్నికల సమయంలో చీలిపోయి పార్టీ మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

నియామకం అనివార్యం

ఉత్తర తెలంగాణ జిల్లాలో అతిపెద్దదైన వాటిలో రెండోవది జమ్మికుంట వ్యవసాయ మార్కెట్. పాలకవర్గం లేకుండా తొలిసారిగా 8 నెలలుగా కొనసాగుతోంది. రైతుల క్రయ విక్రయాలలో పత్తి ధరలు రోజురోజుకు పడిపోతున్నాయి. వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు తగ్గిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాలకవర్గం ఏర్పాటుతో రైతులకు ధరలు, సమస్యల విషయంలో హెచ్చు తగ్గులపై చర్చించి, రైతులకు న్యాయం చేసేలా అవకాశం ఉంటుందని, వెంటనే నియామకం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆశావహులు వీరే..

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ మహిళా చైర్మన్ రిజర్వేషన్ విడుదల కావడంతో సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు వారి సతీమణుల కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ పోడేటీ రామస్వామి, మాజీ సర్పంచ్ పర్లపల్లి రమేశ్, కౌన్సిలర్ మారపల్లి బిక్షపతి, అంబాల ప్రభాకర్, చిలుముల శశికుమార్, మైస మహేందర్, కొత్తురి సాగర్, గుల్లి ప్రతాప్ మరికొందరి సతీమణుల తరపున చైర్మన్ పదవి కోసం పోటీ పడుతున్నారు.

హిందూ ఏక్తాయాత్రను జయప్రదం చేయాలి

హుజూరాబాద్‌రూరల్/ఇల్లందకుంట/జమ్మికుంట: ఈనెల 14న హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఇల్లందకుంట బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి , జమ్మికుంట బీజేపీ పట్టణాధ్యక్షుడు జీడీ మల్లేశ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హిందూ ఏక్తాయాత్ర పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ సమాజాన్ని జాగృతం చేయడానికి కరీంనగర్‌లో హిందూ ఏక్తాయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈయాత్రకు స్వచ్ఛందంగా హిందువులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అస్సాం సీఎం హిమంత బిస్వశర్మ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తెలంగాణ ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాముల కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కేసిరెడ్డి విజేందర్ రెడ్డి, హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, మల్యాల సర్పంచ్ గురుకుంట్ల సాంబయ్య, ఆరెల్లి శ్రీనివాస్, సామలవెంకట్‌రెడ్డి, రావుల విజయ్‌బాబు హనుమాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందిస్తున్న బీజేపీ నాయకులు

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలి

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కరీంనగర్‌టౌన్: జిల్లాలోని గర్భిణులందరికీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఆపరేషన్ ద్వారా ప్రసవాలు నిర్వహిస్తున్న ఆసుప్రతులు, ప్రసవాలపై దృష్టి సారించి తనిఖీలు నిర్వహించాలని అన్నారు. అదేవిధంగా వంద శాతం వ్యాధినిరోధక టీకాలు అందేలా చూడాలని సూచించారు. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలందరికీ అంగన్‌వాడీ కేంద్రాల వద్దే బాలామృతం అందించాలని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పనులు నిర్వహించే ప్రదేశాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు గరిమాఅగర్వాల్, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి, జిల్లా సంక్షేమ అధికారి సబిత, జిల్లా ప్రధాన ఆసుపత్రికి సూపరింటిండెంట్ కృష్ణప్రసాద్, వైద్యులు, ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలో మంచినీటి ఎద్దడి నివారించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో 15 ఫైనాన్స్ నిధుల కింద రూ.35 లక్షలతో నూతనంగా నిర్మించే పైపులైన్ పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. వేసవిలో ప్రజలు మంచినీటి సమస్యను ఎదుర్కోవద్దనే ఉద్దేశ్యంతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వేణుమాధవ్, కౌన్సిలర్లు వేముల కవితాశేఖర్, చింతల సత్యనారాయణరెడ్డి, ఏఈ ఆసిఫ్, బీఆర్‌ఎస్ నాయకులు కట్ల సుధాకర్, స్వర్గం నర్సయ్య, గున్నాల రమేశ్, అసిఫ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

విద్యార్థులకు అభినందన

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల జెడ్పీ పాఠశాల పదోతరగతి విద్యార్థులను శుక్రవారం పాఠశాల హెచ్ఎం తుమ్మ ఆనందం అభినందించారు. ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు 24కు24 మంది పాస్‌కాగా, తెలుగు మీడియంలో 9మందికి 8 మంది పాసైనట్లు తెలిపారు.ఎస్ఎంసీ చైర్మన్ ఎన్.లక్ష్మి, ఉపాధ్యాయులు రాజరత్నం, వేణుగోపాల్‌రావు, గంగారాం, శ్రీనివాస్,విద్యార్థులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

సప్తగిరికాలనీ(కరీంనగర్): పదో తరగతి ఫలితాల్లో 10జీపీఏ, 9 జీపీఏతో అత్యుత్తమ ఫలితాలు సాధించిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. అ దే విధంగా పిల్లలను కష్టపడి చదివించిన వారి తల్లిదండ్రులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని నాయీబ్రాహ్మణ విద్యార్థులు గర్శకుర్తి నర్సయ్య నంబర్ 94406 84602కు ఈనెల 15లోపు వివరాలు తెలపాలని వివరించారు.

'డాక్టర్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి'

కరీంనగర్‌టౌన్: కేరళలోని కొల్లాం మెడికల్ కాలేజ్ వైద్యశాలలో జూనియర్ డాక్టర్ వందన దాస్‌పై దాడి చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐఎంఏ కరీంనగర్ అధ్యక్షుడు డాక్టర్ రాంకిరణ్, కార్యదర్శి డాక్టర్ వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీసు కస్టడీలో చికిత్స కోసం వచ్చిన వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైద్యులపై ఇలాంటి హింసాత్మక సంఘటనలు దేశంలో వివిధ ప్రాంతాల్లో పునరావృతం కావడాన్ని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణలోని నిమ్స్ వైద్యశాలలో రెసిడెంట్ డాక్టర్‌పై దాడిచేసిన వారిని కూడా కఠినంగా శిక్షించాలని, లేకుంటే ఇలాంటి వరుససంఘటనలు డాక్టర్ల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు.

నేడు మంత్రి గంగుల భూమిపూజ

కొత్తపల్లి: శివారుప్రాంతంలోని కొత్తపల్లి–వెలిచాల బైపాస్‌పై రూ.4.40 కోట్ల వ్యయంతో నిర్మించే హైలెవల్ వంతెనకు శనివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ భూమిపూజ చేయనున్నారు. ఈ కాజ్‌వే నిర్మాణానికి పునాది పడుతుండటంపై ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

తిమ్మాపూర్: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణ, హోమం, ధ్వజస్తంభం, శివపంచాతన కాశీ విశ్వేశ్వరుని విగ్రహప్రతిష్ఠ, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయచైర్మన్ మేడిపల్లి జనార్దన్‌రెడ్డి, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పురాణం మహేశ్వరశర్మ పర్యవేక్షణలో నిర్వహించారు. ముందుగా గణపతి హోమం, కుంకుమ పూజ, కళ్యాణం, బలి ప్రధానం పూర్ణాహుతి, హారతి, తీర్థ ప్రసాదం, ఆశీర్వచనం, పలు పూజా కార్యక్రమాలను పవన్ శర్మ, పురుషోత్తమ శర్మ నిర్వహించారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలుచేశారు. మూడురోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు చుట్టుపక్కల గ్రామాలనుంచి అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ మేడిపల్లి జనార్దన్‌రెడ్డి, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, కమిటీసభ్యులు సర్పంచ్ మల్లెతుల అంజయ్య, ఉపసర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, పిరమల్ బ్యాంకు మేనేజర్ కానిగంటి శ్రీనివాస్‌రెడ్డి భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాల, గట్టుభూత్కూర్, చర్లపల్లి, గోపాల్‌రావుపల్లి, నర్సింహులపల్లి గ్రామాల్లో శుక్రవారం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగుతో కలిగే లాభాలు, ప్రభుత్వం అందించే సబ్సిడీ వివరాలను రైతులకు వివరించారు. పెట్టుబడి, దిగుబడితో పాటు సాగుచేస్తే వచ్చే లాభాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో వ్యవసాయశాఖ అధికారులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పుస్తెమెట్టెలు పంపిణీ

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్‌కు చెందిన, కరీంనగర్ డెయిరీ సభ్యుడు బూట్ల భాస్కర్ యశోద కుమార్తె కవిత వివాహం శుక్రవారం వారి స్వగృహంలో నిర్వహించగా కార్యక్రమానికి డెయిరీ సూపర్‌వైజర్ గాజుల లక్ష్మీనర్సయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు జాగిరి శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి న్యాలపట్ల శంకర్‌గౌడ్, కరుణాకర్ హాజరై వధువుకు పుస్తె మెట్టెలు అందించారు. కార్యక్రమంలో డెయిరీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పుస్తెమెట్టెలు అందిస్తున్న డెయిరీ సభ్యులు

క్రీడలను విజయవంతం చేయండి

చొప్పదండి: ఈనెల 15 నుంచి 17 వరకు నిర్వహించే సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14న మధ్యాహ్నం జెడ్పీ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో మండలస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే జట్లను ఎంపిక చేస్తామన్నారు. పట్టణంలోని 14 వార్డుల్లో ఉత్సాహవంతులైన 15 నుంచి 36 ఏళ్ల వయస్సు గల క్రీడాకారులు పాల్గొనాలని సూచించారు. ఔత్సాహిక మహిళా స్వశక్తి మహిళలు క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు.

క్రీడలు సద్వినియోగం చేసుకోవాలి

వీణవంక: సీఎం కప్ 2023 క్రీడపోటీల్లో భాగంగా మండలస్థాయి క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రేణుక తెలిపారు. మండలకేంద్రంలోని ప్రభుత్వపాఠశాలలో ఈనెల 15నుంచి 17 వరకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన బొంగోని సదానందం కౌలురైతు ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పరామర్శించి సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించి అండగా ఉంటానని హామీఇచ్చారు. ఆయనవెంట గౌడ సంఘం అధ్యక్షుడు గద్దం కుమారస్వామి, పెద్ది మల్లారెడ్డి, రామిడి ఆదిరెడ్డి, మాడ గౌతంరెడ్డి, నరసింహరాజు, ఎనగంటి శ్రీనివాస్, మారం తిరుపతిరెడ్డి, అఖిల్ పాషా, మోటం వెంకటేశ్ ఉన్నారు.

భూమాచారి కుటుంబాన్ని ఆదుకుంటాం

సైదాపూర్: సీపీఐ మండల మాజీ కార్యదర్శి చీర్లంచ భూమాచారి మృతికి సీపీఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి, ఇందుర్తి మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ప్రగాఢ సానుబూతి తెలిపారు. భూమాచారి కుంటుంబాన్ని ఆదుకుంటామన్నారు. శుక్రవారం మండలంలోని సర్వాయిపేటలో భూమాచారి కుటుంబాన్ని పరామర్శించారు. పలు గ్రామాల్లో పర్యటించారు.

'విద్యుత్ బిల్లుల కేంద్రాన్ని తొలగించడం సరికాదు'

కరీంనగర్: నగరంలోని కమాన్ కూడలి వద్ద ఉన్న విద్యుత్ బిల్లుల కేంద్రాన్ని తొలగించడం సరికాదని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజులు పేర్కొన్నారు. ఈ కేంద్రం కమాన్ వద్ద ఉండడంతో స్థానికంగా వృద్ధులు, మహిళలు ఇక్కడ విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు అనుకూలంగా ఉండేదని తెలిపారు. విద్యుత్ బిల్లులకేంద్రం తొలగించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



కల్యాణం వీక్షిస్తున్న భక్తులు

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ వాలీసుగ్రీవుల ఆలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణం అర్చకుడు మధుసూదనా చార్యులు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ధర్మారం, కన్నాపూర్ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామం శ్రీ పంచముఖ అంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేకంగా ఆభిషేకం, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన కార్యక్రమాలను అర్చకులు లొంకల వెంకటరమణ, గంజి రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వాములకు అన్నదానంచేశారు. కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ చెన్నమనేని రాజేందర్‌రావు, మాజీ ఎంపీపీ వంచ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు









దంచికొడుతున్న ఎండలు

పదిహేను రోజులుగా చల్లబడిన భానుడు రెండు, మూడు రోజులుగా భగభగలాడుతున్నాడు. ఉదయం ఎనిమిది గంటలకే ఎండలు దంచి కొడుతుండటంతో జనాలు విలవిల్లాడుతున్నారు. శుక్రవారం ఉష్ణోగ్రతలు పెరగడంతో మధ్యాహ్న సమయంలో జనం బయటకు రావడానికి జంకుతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చే వారు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్